


# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి అభివృద్ధికి పట్టం కట్టండి

## హుజూరాబాద్,జమ్మికుంట మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తున్నాం

**జీ న్యూస్, హుజురాబాద్:**

హుజూరాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హుజూరాబాద్ జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో మంచి మెజారిటీతో విజయం సాధించబోతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని డిసిఎంఎస్ కాంప్లెక్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కార్నర్ మీటింగ్ లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోపే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్ సౌకర్యాన్ని,గృహలక్ష్మి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కలలు నిజం చేసే ఇందిరమ్మ ఇళ్లు,పేదల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వంగా పేదలకు ఉచిత సన్న బియ్యాన్ని అందజేశామని ఇలాంటి సంక్షేమ పథకాలతో దేశంలోనే సంక్షేమ పథకాలను అమలులో ఆదర్శంగా నిలిచామని, ఇలాంటి పని చేసే ప్రభుత్వాన్ని ప్రజలు రాష్ట్రం అంతటా అన్ని ఎన్నికల్లో ఆదరిస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తే మరిన్ని నిధులు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మిగిలిందల్లా అభ్యర్థుల గెలుపే మిగిలిందని అన్నారు. నియోజకవర్గ ఇంచార్జిగా ప్రణవ్ మంచి పనులు చేస్తున్నాడని, ఇక్కడి ఎమ్మెల్యే చిల్లర వేషాలతో హుజూరాబాద్ అభివృద్ధికి విరోధకుడిగా నిలుస్తున్నాడని అన్నారు. గతంలో ఎంపీ గా ఈ ప్రాంతానికి సేవ చేసిన వ్యక్తిగా ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాబోయే 3 ఏళ్లలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ నుండి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.







# ప్రజాసేవ కోసమై పోటీ చేస్తున్నా

## ఒక్క చాన్స్ ఇవ్వండి.. మోడల్ వార్డుగా తీర్చి దిద్దుతా

**జీ న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

గ్రామీణ ప్రజలకు... నిరుపేదలకు సేవ చేయాలనీ... ప్రతి పనిని మానవతా కోణంలో ఆలోచించి అమలు చేయాలని సంకల్పంతో తాను 7వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నట్లు వినీత పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన అనేక హామీలను ఒక్కొక్కటిగా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నదని.. తనను గెలిపించినట్లయితే ఈ ప్రాంత ప్రజలకు ఏ సమస్య వచ్చినప్పటికీ ఆ సమస్య తనదిగా భావించి పరిష్కరిస్తానని ఆమె ఓటర్లకు హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. తాను పోటీ చేస్తున్న విష యం తెలియగానే వివిధ వర్గాలకు తమ వార్డుకు చెందిన మహిళలు... యువకు లు.. కలిసి మద్దతు తెలపడం తనకు కొండంత బలాన్ని ఇచ్చినట్లుగా ఆమె వెల్లడించారు.తాత్కాలికమైన భ్రమ లకు లోను కావద్దని... ఐదు సంవత్సరాల పాటు తమ కోసం ఎవరు అండగా నిలుస్తారో గుర్తించి అలాంటి వారికి ఓటు వేయాలని ఈ సందర్భంగా ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రాంత నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి.. తమ నాయకుడు వోడితెల ప్రణవ్ బాబు దృష్టికి తీసుకువెళ్లి తాను అనుక్షణం పని చేస్తానని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఒక్క చాన్స్ ఇవ్వండి. 7వ వార్డు ను మాడల్ వార్డుగా తీర్చిదిద్దుతానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. వినిత కౌన్సిలర్ గా విజయం సాధించినట్లయితే చైర్మన్ పీఠం విషయం లో తీవ్ర పోటీ ఎదురయ్యే అవకాశాలు ఉంటాయని పరిశీలకులు భావిస్తున్నారు.



# పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

**ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి – 07 : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విధులకు హాజరయ్యే వారు పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ కోసం సిద్ధం చేసిన ఫారాలను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, 8వ తేదీ ఆదివారం కూడా ఓటు హక్కు వినియోగించుకో వచ్చని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కునేవారు సంబంధిత ఫారాలు అన్ని జత చేసి తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. పరిశీలనలో నోడల్ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార నాణ్యత పాటించని అధికారులపైన కఠిన చర్యలు



సిద్దిపేట, ఫిబ్రవరి 7 : శనివారం సాయంత్రం మద్దూరు మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి రాత్రి భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, ఆలుగడ్డ టమాటా కూర, టమాటా చట్నీ, సాంబారు, పెరుగు లను తనికి చేశారు. చట్నీ నాణ్యతగా లేదని, సాంబారు నీళ్లలానే ఉందని అసహనం వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్ చెక్ చేశారు. వండిన వంటకు రిజిస్టర్ లో రాసిన సరుకులకు పొంతనే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాసిన రకంగా కూరగాయలు, వంట సరుకులు ఏమైవుతున్నాయని మండిపడ్డారు. రోజు ఏం పెడుతున్నారని విద్యార్థులతో ఆరా తీశారు. కామన్ డైట్ మెను పాటించకుండా ఏదో తక్కువ దరగల కూరలతో వంట చేసి విద్యార్థులకు పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులు, రుచికరంగా వండి అందరికీ సరిపోయే విధంగా ఆహారాన్ని తయారీ చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. కిచెన్, డైనింగ్ హాల్ మురికిగా ఉండడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ పాటించకుండా, రిజిస్టర్ లో అవకతవకలు, ఆహార నాణ్యత పాటించేందుకు అధికారులపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిఈఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యాలయం ప్రాంగణం కలియ తిరిగారు. తరగతిలో వెలుతురు మందకొడిగా ఉందని పిల్లలకు ఇబ్బందులు పడుతున్నారని గమనించి ఎక్కువ టాబ్లెట్లు ఆమార్చాలని సిబ్బందిని ఆదేశించారు. బాగా చదువుకోవాలని ఆహారం బాగా తీసుకోవాలని మంచి క్రమశిక్షణ అలవాట్లు అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికల–2026 ప్రక్రియలో భాగంగా రాత్రి చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చెక్ పోస్ట్ ను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ప్రతి వాహనం తనిఖీలో సమయం తప్పనిసరిగా రాయాలని క్షుణ్ణంగా తనికి చెయ్యాలని విధులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బంది ను ఆదేశించారు.

# అక్రమ సంబంధం ఉచ్చులో మరో భర్త బలి

**మర్రిగూడ, ఫిబ్రవరి 7 :**



ప్రాణంగా ప్రేమించిన భార్య తనను మోసం చేయడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మర్రిగూడ పోలీస్ స్టేషన్ లో చోటు చేసుకుంది.జటావత్ బాలాజీ (35)వృత్తి రీత్యా హైదరాబాద్ లో టాక్సీ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. బాలాజీ కి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.భార్య జటావత్ రజిత విధి నిర్వహణలో భాగంగా అదే గ్రామం చెందిన దగ్గర వరుసైన మరిది ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అమనగల్ లో విధులు నిర్వహిస్తున్న జటావత్ హాథీరామ్ గత కొన్ని నెలలుగా అక్రమ సంబంధం పెట్టుకుంది. గతంలో రెండు మూడుసార్లు ఇలాంటి అక్రమాలు కూడదని గ్రామంలోని పెద్దల మధ్య హెచ్చరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల2 నాతన భార్య రజిత హాథిరామ్ తో కలసి ఉన్న నిర్వాహకాన్ని భర్త బాలాజీ కళ్లారా చూశాడు.వ్యక్తితో సంబంధం తీవ్ర మనస్థాపానికి గురై భార్య చేసిన మోసాన్ని తట్టుకోలేక తన పరువు పోయిందని సెల్ఫీ వీడియో తీసి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు రోజులు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బాలాజీ చావుకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి గ్రామస్తులు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రాజు తెలిపారు.

